https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 7 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,అక్టోబర్,1, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా

ఉద్యోగులు పనిచేయాలి

కరీంనగర్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 30: పేదలకు సంక్షేమ పథకాలు అందాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి.. కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఆపై కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతినిధులని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేది అధికారులే అని చెప్పుకొచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, మిగతా సమస్యలను కూడా పరిష్కరిస్తామని వెల్లడించా రు.ప్రభుత్వానికి మంచిపేరు వచ్చినా.. చెడ్డపేరు వచ్చినా అది ప్రభుత్వ ఉద్యోగుల వల్లే అని సీఎం అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.944 కోట్లతో పనులను ప్రారంభించుకున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. అందరి సహకారంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. సహాయం కోసం వచ్చినవారిలో కుటుంబసభ్యులను చూడాలన్నారు. సమస్యలతో వచ్చిన పేదలకు వెంటనే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ముందు కార్యక్రమాలను ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలన్నారు. ఎన్నికలు లేని సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

సిరిసిల్లలో చేసిన అభివృద్ధిలో పదిశాతం చేయగలరా'..

సీఎం రేవంత్‌కు పాడి కౌశిక్ సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 30: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ సీఎం అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కట్టిన వాటికి రేవంత్ రిబ్బన్ కట్ చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ కలెక్టరేట్ కేసీఆర్ ఆనవాళ్లు కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని.. ఆయన కట్టినవే ప్రారంభిస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో కాంగ్రెస్ తల్లిని నిలబెట్టారని ఎమ్మెల్యే అన్నారు. రెండు సంవత్సరాల్లో మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తల్లిని ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు పంపుతామన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభకు జనం రావడం లేదని అన్నారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి చూడాలన్నారు. సిరిసిల్ల అభివృద్ధిలో పదిశాతం కొడంగల్‌లో చేసి చూపెట్టాలని సవాల్ విసిరారు. రేవంత్ సొంత గ్రామంలో కరెంట్ ఇవ్వడం లేదని పాడి కౌశిక్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



తెలంగాణ: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన చిన్నపల్లి అంకిత (25) తొర్రూరు పట్టణంలో నివాసముంటోంది. కొడకండ్ల మండల కేంద్రంలోని పోస్టల్ శాఖలో ఏడీ డీఏ(ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంటల్ డెలివరీ ఏజెంట్)గా ఉద్యోగం చేస్తోంది.ఆమె భర్త మందుల శశికాంత్ నర్సంపేట మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో తరుచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొడకండ్లలో అంకిత విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఫోన్‌లో ఇరువురు గొడవపడ్డారు. దీంతో అంకిత మంగళవారం మధ్యాహ్న విధులు ముగించుకుని ఇంటికి వచ్చింది.గొడవలతో మనస్తాపం చెందిన ఆమె తొర్రూరులో అద్దెకు ఉండే నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ఢిల్లీలో వాయు కాలుష్యం.. టపాసుల వాడకంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్,30:దేశంలో అత్యంత వాయు కాలుష్యం ఉన్న నగరాల్లో ఢిల్లీ ఒకటి. అలాంటి నగరంలో టపాసుల వాడకం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. టపాసుల్ని పూర్తిగా నిషేధించలేమని, అలాగే, 24 గంటలపాటు అనుమతివ్వలేమని కోర్టు వ్యాఖ్యానించింది. అందుకే, మధ్యంతరంగా ఒక పరిష్కారం కనుగొనాలని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించలేం. అలా చేస్తే కొందరి మనోభావాలు దెబ్బతింటాయి. అలాగని, టపాసులు కాల్చేందుకు 24 గంటలు అనుమతి ఇవ్వలేం. దీనివల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు చాలా ఇబ్బందులు పడుతారు. అందుకే, ఈ విషయంలో ఒక మధ్యంతర పరిష్కారం అవసరం. అలాగే, కాల్చే టపాసులు ఎలాంటివి ఉండాలి.. ఎంత కాలుష్యం విడుదల చేసేవి.. ఎంత శబ్ద కాలుష్యాన్నిఅనుమతించాలి వంటి విషయాల్లో కొన్ని నిబంధనలు రూపొందించాలి. కొన్ని గంటలపాటే టపాసులు కాల్చేందుకు అనుమతివ్వాలి. అది ఎంత వరకు అనేది తేల్చాలి. ఈ అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. టపాసులు కాల్చే విషయంలో, అనుమతించే విషయంలో తాము సూచించిన నిబంధనల్ని పరిశీలించాలని.. ఈ విషయంలో స్పందన తెలియజేయాలని కోర్టు కేంద్రానికి సూచించింది. కేసు తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. ఢిల్లీలో మామూలుగానే భారీ వాయు కాలుష్యం నమోదవుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు కొన్నేళ్లుగా అక్కడి ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. అలాంటిది. కొన్ని ఫెస్టివల్స్ సందర్భంగా టపాసులు కాల్చడంతో ఇంకా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే, ఈ అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

ఎన్నికల కమిషన్‌లో విభేదాలపై ఇండియా కూటమి సమావేశం

న్యూఢిల్లీ,సెప్టెంబర్,30:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్రా జీనామా డిమాండ్ నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా కూటమి ఇవాళ ఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఉమ్మడి పోరుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి సుమారు 13 కోట్ల పేర్లను అక్రమంగా తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్‌లోనే అంతర్గత విభేదాలున్నాయని, ఇద్దరు కమిషనర్‌లు పలుమార్లు అభ్యంతరాలు తెలిపారని మీడియా కథనాలు రావడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలని కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ సమావేశం లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, వామపక్షాలు, ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ) నేతలు పాల్గొంటున్నారు.

డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో కీలక మలుపు..

8 మందిపై బినామీ చట్టం కింద కేసులు..

- దేశంలోనే ఇదే తొలిసారి!- సస్పెండైన డీఎస్పీ భీమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం- ఏసీబీ దర్యాప్తుతో పాటు రంగంలోకి దిగిన ఆదాయపు పన్ను శాఖ- భీమ్‌రెడ్డి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై కేసులు నమోదు- దేశంలోనే తొలిసారిగా బినామీ చట్టం కింద ఈ తరహా కేసులు- ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించిన దర్యాప్తు సంస్థలు



హైదరాబాద్,సెప్టెంబర్,30:అక్రమాస్తుల కేసులో సస్పెండైన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు సంస్థలు దూకుడు పెంచాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు కొనసాగుతుండగానే, తాజాగా ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించారని అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. దేశంలోనే ఈ చట్టం కింద ఇలాంటి కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ కేసులో దర్యాప్తు మరింత తీవ్రరూపం దాల్చింది. డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27న కేసు నమోదైన తర్వాత తెలంగాణ, కర్ణాటకలోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లకు పైగా విలువైన భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లను గుర్తించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ ఆస్తుల గుర్తింపుతో కేసు తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఏసీబీ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతరుల పేర్లతో ఉన్నట్లు తేలింది. వీటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉన్నాయనే అనుమానంతో అధికారులు బినామీ కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఇందుకోసం కోర్టు నుంచి ప్రత్యేకంగా సెర్చ్ వారెంట్లు పొంది, భీమ్‌రెడ్డికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో కీలకమైన ఆస్తుల పత్రాలు, నగదు, బంగారంతో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అందించిన సమాచారం ఆధారంగా ఐటీ శాఖ ఈ కేసులో కీలక అడుగు వేసింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసింది. ఈ ఆస్తుల కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆస్తులకు అసలు యజమాని ఎవరు? వాటిని ప్రస్తుతం ఎవరు నియంత్రిస్తున్నారు? అనే కోణాల్లో ఐటీ అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు.



ప్రత్యామ్నాయ పంటల సాగుపై

రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల్ (డీకే చాటింపు):సాధారణంగా సాగుచేసే వరి పత్తి మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రత్నం సుకుమారి, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్ ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్ లు ఆర్. సత్తయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డి లతో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు. ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రైతులు వరి, పత్తి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ పరిస్థితులు, పంటలకు లభించే ధరలు, సాగు వ్యయం, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్, పందిరి సాగు, పండ్ల సాగు వంటి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల కొరకు చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక పకడ్బందీగా చేసుకోవాలని, నానో యూరియా, నానో డి ఎ పి వినియోగం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల కొరకు జిల్లాలోని లక్షెట్టిపేటలో విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ, సహకారాన్ని రైతులకు వివరించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యమైన పంట ఉత్పాదకత పెంపొందించేలా అధికారులు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ.... రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించేలా కృషి చేయాలని తెలిపారు. వరి, మొక్క పత్తి వంటి సాధారణ పంటలే కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కల్పిస్తున్న అవకాశాలపై రైతులు చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు.జిల్లాలో ఉత్తమంగా వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

ఏఎస్ఐ తిమ్మారెడ్డి

పదవి విరమణ వేడుకలు

-పోలీస్ శాఖలో అందించిన సేవలు ప్రశంసనీయం... -జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్... -శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి...



నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లాలోని ఉట్కూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.తిమ్మారెడ్డి బుధవారం పదవి విరమణ చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులు,శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఆయన పోలీస్ శాఖకు చేసిన విశిష్ట సేవలను పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరికీ పదవి విరమణ తప్పనిసరి ప్రక్రియ అని పేర్కొంటూ పీసీ స్థాయి నుంచి ఏఎస్ఐ వరకు 37 ఏళ్ల పాటు అంకితభావంతో పోలీస్ శాఖకు సేవలందించిన ఎస్. తిమ్మారెడ్డి సేవలు అభినందనీయమని అన్నారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని,ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అలాగే పోలీస్ శాఖ నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. పదవి విరమణ అనంతరం ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుందని,అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు.తిమ్మారెడ్డి 1989 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి,అంచలంచలుగా పీసీ, హెడ్ కానిస్టేబుల్,ఏఎస్ఐ హోదాల్లో పదోన్నతీ పొంది, 37 ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించి,ఉట్కూర్ పోలీస్ స్టేషన్ నుంచి పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య నిర్మల ఒక కుమారుడు, మఒక కూతురు ఉన్నారని వారు సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య,సీఐలు రామ్ లాల్,భగవంత్ రెడ్డి,సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, పోలీసు ప్రెసిడెంట్ హెచ్ సి సుదకార్,ఎస్ఐలు రమేష్, భాగ్యలక్ష్మి రెడ్డి,కూతురు అంజలి,అల్లుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ సిఏ అండర్-15

రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు జె.శ్రీనిధి ఎంపిక

-నారాయణపేట బ్రిలియంట్ గ్రామర్ పాఠశాల విద్యార్థిని...-

విద్యార్థినిని సత్కరించిన కళాశాల ప్రిన్సిపాల్...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో 9వ, తరగతి విద్యార్థిని జె.శ్రీనిధి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్ సిఏ) అండర్-15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు.బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ రవి విద్యార్థిని శ్రీనిధిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నారాయణపేట క్రికెట్ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని తెలిపారు.భవిష్యత్తులో శ్రీనిధి మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు, నారాయణపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.శ్రీనిధి సాధించిన ఈ ఘనత నారాయణపేటలోని ఇతర బాలికలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ప్రజల చేతిలో సమాచార హక్కు.. ప్రశ్నించే శక్తికి పదును...

అక్టోబర్ 7న రవీంద్రభారతిలో ఆర్టీఐ సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవ అవగాహన సదస్సు...



బెల్లంపల్లి (డీకే చాటింపు) సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, చట్టబద్ధంగా తమ హక్కులను సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచడమే లక్ష్యంగా అక్టోబర్ 7న రవీంద్రభారతిలో ఆర్టీఐ సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు తాండూర్‌లో సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లపు రాజు ప్రకాష్ పటేల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందే విధానం, ప్రజలకు ఉన్న హక్కులు, ఆర్టీఐ దరఖాస్తు ప్రక్రియపై సదస్సులో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పురెళ్ల శ్రీనివాస్, నస్పూర్ జనరల్ సెక్రటరీ తునికి శ్రీనివాస్ రాజు, జిల్లా కోఆర్డినేటర్ పార్వతి అజయ్, తాండూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంపెల్లి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు చింతల సంతోష్, మండల డిప్యూటీ ప్రెసిడెంట్ తోగరి సతీష్, అనిల్, పప్పుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి సందర్శించిన వినయ్ రెడ్డి



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 30 (డీకే చాటింపు):ఆర్మూర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సమస్యలపై సూపర్డెంట్ డాక్టర్ ప్రమిద, డాక్టర్ అమృతరామిరెడ్డి లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డయాలసిస్ సెంటర్ ని నిశితంగా పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రికి కావలసిన వైద్య పరికరాలు మెడిసిన్ గురించి అడిగారు. ఆస్పత్రికి రేడియాలజిస్టు అదనపు స్టాఫ్ నర్సులు ఎక్స్రే మిషన్ అవసరం ఉందని సూపర్డెంట్ తెలిపారు. నీటి వసతి ఇబ్బంది ఉందని బోరు పనిచేయడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ చైర్మన్ లకు తెలుపుతూ వెంటనే బోర్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరతపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రి సందర్శనలో వినయ్ కుమార్ రెడ్డి తో పాటు మున్సిపల్ చైర్మన్ గోనెలహరి రఘు, కౌన్సిలర్లు ఉపేందర్ ,నవీన్, ప్రసాద్ మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి ,నాయకులు శ్రీనివాస్ గౌడ్ రవీందర్ రెడ్డి రాకేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజులను తగ్గించాలి

-పిడిఎస్యు డిమాండ్...-నారాయణపేట డిగ్రీ కళాశాల ముందు పిడిఎస్యు కళాశాల కమిటీ ఆధ్వర్యంలో నిరసన...

నారాయణపేట,(డీకే చాటింపు): డిగ్రీ సెమిస్టర్ ఫీజులను తగ్గించాలని కోరుతూ పి.డి.ఎస్.యు కాలేజీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ గత నాలుగైదు సంవత్సరాల నుంచి డిగ్రీ సెమిస్టర్ ఫీజులను అధికంగా పెంచుతున్నారన్నారు. ఇదివరకు ఒక సెమిస్టర్ కు బి.ఏ వారికీ రూ. 600-700 వరకు ఉండి బి.జెడ్.సి,బీకాం కోర్సు వారికి రూ.800-900 లేదా రూ.1000 వరకు ఉండేదన్నారు.ఈ డిగ్రీ కళాశాల పాలమూరు యూనివర్సిటీ కిందకి ఉండడంతో విద్యార్థులతో అధిక సెమిస్టర్ వసూలు చేస్తున్నారని,దానివల్ల అనేక డబ్బులు పాలమూరు యూనివర్సిటీ కి చేరుకోగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం ఎలాంటి నిధులను ఇవ్వలేదని అన్నారు.దీనివల్ల కళాశాలలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాలుతున్న పరిస్థితి ఉందన్నారు.అంతేకాకుండా విద్యార్థులతో బయోమెట్రిక్ ఫీజును తీసుకొని మోసం చేస్తున్నారన్నారు.ఒకొక్క విద్యార్థితో బయోమెట్రిక్ ఫీజు రూ.200 వసూలు చేయడం సరియైనది కాదని వారు మండి పడ్డారు.అసలు ఆ బయోమెట్రిక్ ఫీజు డబ్బులు దేనికోసం ఉపయోగిస్తున్నారో కూడా తెలియట్లేదన్నారు.ఇది పూర్తిగా విద్యార్థులను మోసం చేస్తున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. అంతేకాకుండా రీకౌంటింగ్ పేరుతో ఒక్కో సబ్జెక్టుకి రూ. 300 తీసుకోవడం ఇది పెద్ద అన్యాయం మండిపడ్డారు. వీటిని వెంటనే తగ్గించకపోతే విద్యార్థులతో కలిసి ధర్నాలు చేపట్టడం కోసం వెనకాడ బోమని స్పష్టం చేశారు.వీలైతే పాలమూరు యూనివర్సిటీ ముందు విద్యార్థితో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు కాలేజ్ కమిటీ నాయకులు ఇవరాజ్,శివ,శ్రీను,శ్రీకాంత్, చంద్రకళ,కళ్యాణి,అక్షత, కాలేజీ విద్యార్థులు పాలొగొన్నారు.



ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా

డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల్ (డీకే చాటింపు):ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని దండేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన విచారణలకు సంబంధించిన కేసుల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, తదుపరి 2 రోజులలో పురోగతిని స్పష్టంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను అనుసరించి నియమ నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, మీ-సేవా ధ్రువపత్రాలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలోనిహాజన్నారం మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రైండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్లు 160, 161 కి సంబంధించిన "అల్లంవారి కుంట" అంశంపై ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై కలెక్టరేట్ సూపరింటెండెంట్-బి, జన్నారం నీటిపారుదల శాఖ ఎఈఈ లతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫిర్యాదుదారుల వాదనలు విని, సమస్యకు సంబంధించిన అంశాలను పరిశీలించి, జన్నారం తహసిల్దార్, మండల గిర్దావర్‌కు తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,అక్టోబర్,1, 2026

భారత్‌కు సైబర్ దాడుల ముప్పు..!

ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో దేశాల మధ్య రాజకీయ, భౌగోళిక విభేదాలు ఇక కేవలం దౌత్యం లేదా సైనిక చర్యలకే పరిమితం కావడం లేదు. సైబర్ రంగం కూడా యుద్ధభూమిగా మారింది. ప్రభుత్వాలు, సిద్ధాంతపరమైన సంస్థలు, రహస్య గ్రూపులు తమకు వ్యతిరేకంగా ఉన్న దేశాలపై సైబర్ దాడులు నిర్వహిస్తూ కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ర్యాన్సమ్ వేర్, మాల్వేర్, డేటా చౌర్యం, గూఢచర్యం వంటి పద్ధతుల ద్వారా ఆయా దేశాల భద్రతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సవాళ్లను భారత్ కూడా తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఆర్థిక, సాంకేతిక, డిజిటల్ రంగాల్లో వేగంగా ఎదుగుతున్న భారతదేశం సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా సమాచార సాంకేతికం, పరిశ్రమలు, టెలికమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఔషధ రంగాలపై దాడులు పెరుగుతున్నాయి. ఈ దాడుల వెనుక పాకిస్థాన్, చైనా, ఉత్తరకొరియా వంటి దేశాలకు చెందిన హ్యాకింగ్ ముఠాలు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా రష్యాకు చెందిన కొన్ని సైబర్ నేరగాళ్ల నుంచి కూడా ముప్పు ఎదురవుతోంది. భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇలు)ఇటీవలి కాలంలో ఎక్కువగా సైబర్ దాడులకు గురవుతున్నాయి. పరిమిత వనరులు, సాంకేతిక భద్రతలో లోపాల కారణంగా అవి ఈ దాడులను సమర్థంగా ఎదుర్కోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో దేశ ఆర్థిక స్థిరత్వంపై కూడా ప్రభావం పడుతోంది. ప్రపంచ వేదికపై భారత్ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యర్థి శక్తులు కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, నెట్‌వర్క్‌లపై మాల్వేర్ దాడులను ముమ్మరం చేస్తున్నాయి. వాటిలో ట్రోజన్ మాల్వేర్ దాడులు అత్యధికంగా నమోదవుతున్నాయి. డేటా సెక్యూరిటీ కౌన్సిల్ విడుదల చేసిన 2024 నివేదిక ప్రకారం మొత్తం మాల్వేర్ దాడుల్లో ట్రోజన్ వాటా సుమారు 43 శాతం ఉంది. అనంతరం ఇన్‌ఫెక్టర్లు, వారమ్స్ వంటి మాల్వేర్ రకాలు చోటు దక్కించుకున్నాయి. గత ఏడాది రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే తెలంగాణ అత్యధిక మాల్వేర్ దాడులను ఎదుర్కొంది. ఆ తర్వాత తమిళనాడు, ఢిల్లీ ఉన్నాయి. నగరాలపరంగా సూరత్ మొదటి స్థానంలో ఉండగా, బెంగళూరు, హైదరాబాద్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. ఇండోనేషియాకు చెందిన హ్యాకింగ్ గ్రూపులు, అలాగే బంగ్లాదేశ్‌కు చెందిన హ్యాక్టివిస్ట్ సంస్థలనుంచి కూడా భారత్‌పై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్- హమాస్, ఇజ్రాయెల్ -ఇరాన్ ఘర్షణల అనంతరం రాజకీయ ఉద్దేశాలతో జరిగే సైబర్ దాడుల సంఖ్య కూడా అధికమైంది. వీటిలో ప్రభుత్వ ప్రోత్సాహం పొందిన గ్రూపులు, హ్యాక్టివిస్ట్ సంస్థలు భాగస్వాములవుతున్నాయి. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ అనంతరం సైబర్ రంగంలో ఉద్రిక్తత మరింత పెరిగింది. భారత ప్రభుత్వ వెబ్‌సైట్ల రూపురేఖలను మార్చే ప్రయత్నాలు, మాల్వేర్ చొప్పించే దాడులు అధికమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత కీలక మౌలిక వసతులు, ఆర్థిక సంస్థలు లక్ష్యంగా మారే అవకాశం ఉందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ హెచ్చరించాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌పై లక్షల సంఖ్యలో సైబర్ దాడి ప్రయత్నాలు నమోదయ్యాయి. ర్యాన్సమ్ వేర్, మాల్వేర్, డేటా చౌర్యం, గూఢచర్యం వంటి పద్ధతుల ద్వారా ఆయా దేశాల భద్రతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సవాళ్లను భారత్ కూడా తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఆర్థిక, సాంకేతిక, డిజిటల్ రంగాల్లో వేగంగా ఎదుగుతున్న భారతదేశం సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా సమాచార సాంకేతికం, పరిశ్రమలు, టెలికమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఔషధ రంగాలపై దాడులు పెరుగుతున్నాయి. ఈ దాడుల వెనుక పాకిస్థాన్, చైనా, ఉత్తరకొరియా వంటి దేశాలకు చెందిన హ్యాకింగ్ ముఠాలు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా రష్యాకు చెందిన కొన్ని సైబర్ నేరగాళ్ల నుంచి కూడా ముప్పు ఎదురవుతోంది.



సర్ ఫేజ్-2లో భాగంగా సాయి నగర్ వార్డు కార్యాలయంలో బి ఎల్ ఓ ల పనితీరు పర్యవేక్షణ

తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్



ఎల్బీనగర్, (డీకే చాటింపు) సర్ ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా ఈరోజు నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న బి ఎల్ ఓ ల పనితీరును నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా బి ఎల్ ల వద్దకు వచ్చిన సర్ నోటీసుల వివరాలను పరిశీలించి, సంబంధిత నోటీసులను అర్హులైన ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి అందజేయాలని సూచించారు. ఓటర్లకు నోటీసులపై పూర్తి అవగాహన కల్పిస్తూ, అవసరమైన వివరాలు మరియు పత్రాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు నమోదును సక్రమంగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ఇంటింటి పర్యటనలో భాగంగా ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవడం, ఓటరు జాబితాలో తమ పేరు మరియు వివరాలను పరిశీలించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. “అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం” అని చింతల అరుణ సురేందర్ యాదవ్ గారు పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో బి ఎల్ ఓ లకు ప్రజలు సహకరించి, అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జి ఎస్ × డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి గారు, బీజేపీ సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య గారు, సంజీవరెడ్డి రావుల శ్రీనివాస్ గారు తదితరులు పాల్గొన్నారు

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు మరింత ప్రయోజనం

లక్కంపల్లి సెజ్ భూములను పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 30 (డీకే చాటింపు): జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానిక రైతాంగానికి మరింత ప్రయోజనాలు చేకూరు తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు.రైస్ బ్రాన్ ఆయిల్, సోయా పరిశ్రమల ఏర్పాటుకు సైతం కృషి చేస్తామని వెల్లడించారు.నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొ ల్పేందుకు నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ కు ఆనుకుని ఉన్న స్థలాలను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సెజ్ ప్రాంతంలో ఫ్యాక్టరీ కోసం గుర్తించిన స్థలం అనుకూ లతపై అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం, పొరుగున ఉన్న నిర్మల్ జిల్లా 50 కిలోమీటర్ల లోపే ఉండడం, రెండు జిల్లాలలో ఇప్పటికే 17వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగులో ఉండడం, మరో ఐదు వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉండడం వంటి అంశాలు స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూలంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఆయిల్ పామ్ ఫాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంసిద్ధత తెలిపారని అన్నారు.

ఆయిల్ ఫామ్ తోటలపై రైతులు దృష్టి సారించాలి

ఆయిల్ కామ్ ఫ్యాక్టరీని దృష్టిలో పెట్టుకుని రైతులు కూడా ఆయిల్ పామ్ సాగుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటును అందిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా ప్రజల అవస రాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణం లోపే ఈ పంట సాగు చేస్తున్నారని అన్నారు.ఇతర దేశాల నుండి వంట నూనె నిల్వలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకో వాల్సి రావడం భారంగా పరిణమించిందని, స్థానికం గానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు ప్రజలకు కూడా మేలు చేసిన వారవు తారని అన్నారు.జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు గణనీయమైన లాభాలు సమకూరడమే కాకుండా, ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లక్కంపల్లి సెజ్ ప్రాంతంలోని రైస్ బ్రాన్ ఆయిల్, సోయా పరిశ్రమ లను కూడా నెలకొల్పేందుకు స్థలాలు అందుబాటులో ఉన్నందున వీటి ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని అన్నారు. అంతేకాకుండా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సేంద్రీయ విధానం ద్వారా చేపడుతున్న కూరగాయల సాగు పద్ధతులను అధ్యయనం చేసి, ఇక్కడ కూడా అదే తరహాలో కూరగాయ పంటలు సాగు చేసేలా ప్రోత్స హిస్తామని అన్నారు. స్థల పరిశీలన జరిపిన వారిలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడి పిలుపునిచ్చిన ఏఐటీయూసీ



క్యాతన్ పల్లి(డీకే చాటింపు): రామకృష్ణాపూర్ ఏఐటియుసి యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు కీలక నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ.., దేశంలో రాజ్యాంగ బద్ధ సంస్థ అయినా ఎన్నికల సంఘంలో కలహాలు రావడం దేశ ప్రజలకు ఎదురవుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలన్నారు. ఎన్నికల మీద ప్రజలు విశ్వాసం కోల్పోతే ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా నిర్వహణ వంటి కీలక అంశాలపై సీఈసీ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి, ఎన్నికల సంఘంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు సీపీఐ పట్టణ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి, వనం సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, కాదండి సాంబయ్య, మామిడి గోపి, ఎగుడ మొండి, నక్క వెంకటస్వామి, పార్టీ ప్రజాసంఘాల నాయకులు మండల శ్రీనివాస్, కారుకూరి రాయలింగు, యండి హుస్సేన్, గజ్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక



బెల్లంపల్లి (డీకే చాటింపు)బెల్లంపల్లిలోని తెలంగాణ జనరల్ గురుకుల క్రీడా మైదానం లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14,17 ఖోఖో పోటీల్లో తెలంగాణ సాశీఖీక సంక్షేమ కాసిపేట గురుకులం తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఆర్.వాల్ సింగ్, కె.మహిక్షిత్, జి.అక్షయ్ జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యరని ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ పోటీలను ఎస్. జి. ఎఫ్ జిల్లా సెక్రటరీ ఎం డి. యాకుబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. జోనల్ లెవల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో పిడి . హరీష్ ,పి.ఇ.టి.రాజేందర్,ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 30 (డీకే చాటింపు):ఆర్మూర్ మున్సిపాలిటీ 27వ వార్డు స్వాతంత్ర కౌన్సిలర్ రియాజ్ ఈరోజు కాంగ్రెస్ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులకు మున్సిపాలిటీకి నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతగా పార్టీలో చేరుతున్నట్లు రియాజ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గం అదేవిధంగా మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, గోనె దామోదర్ సునీల్ రెడ్డి, సదక్ ప్రమోద్ ,రాము, చిన్నాపూర్ సర్పంచ్ సాయి పాల్గొన్నారు.

పులిగిల్ల శ్రీనివాస చారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన



ఎల్బీనగర్, (డీకే చాటింపు) ది అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొలే జగన్నాథం ఈరోజు గౌరవనీయులు పులిగిల్ల శ్రీనివాస చారి 74వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ సమావేశము మైసిగండి అమ్మవారి దగ్గర కేక్ కట్ చేసి శాలువతో సత్కరించడం జరిగినది ఈ సమావేశానికి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ గౌరవ అధ్యక్షుడు కడారు వీర బ్రహ్మచారి ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాస చారి ప్రచార కార్యదర్శి కొల్లోజు సురేష్ చారి యూత్ అధ్యక్షులు కొలే అభిషేక్ కమ్మరి నారాయణ మహిళ వరలక్ష్మి జగదాంబ యాదయ్య తదితరులు పాల్గొని ఘనంగా జరిపినారు జై విశ్వకర్మ

లబ్ధి దారులకు స్మార్ట్ కార్డ్స్ అందజేసిన బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



ఎల్బీనగర్, సెప్టెంబర్ 30 (డికే చాటింపు) ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్నవాళ్లకు స్మార్ట్ కార్డ్స్ ఇస్తుండడంతో ఈరోజు మారుతీ నగర్ కమ్యూనిటీ హాల్ లో పార్టీలకు అతీతంగా చైతన్యపురి డివిజన్ లబ్ధి దారులకు స్మార్ట్ కార్డ్స్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శరత్ చంద్ర, రవి కేశవ్ నాయుడు, బీజేపీ నాయకులు నీరంకి రవి, తిరుమల్ రెడ్డి, రమేష్, విజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

1 న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 30 (డికే చాటింపు): అక్టోబర్ 1 న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కెసిఆర్ కాలనీలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ లో జరుపుతున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల మరియువికలాంగుల సంక్షేమ శాఖ అధికారిని సౌందర్య తెలిపారు. ప్రభుత్వయంత్రాంగము మరియు వివిధ సంఘాల. ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని వయోవృద్ధులు వికలాంగులు పుర ప్రముఖులు పాల్గొనా లని కోరారు. ఈ సందర్భంగా టి.ఎం.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసి ప్రతిపా దించిన ,దేశ రక్షణలో విశేష కృషి చేసిన బి .చెన్నయ్య సైనికుడికి, అదేవిధంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రైతు కే ధనంజయ రెడ్డి లను , జిల్లా స్థాయి వేదుకలలో , వివిధ సంఘాల వారితో పాటు, సన్మానం చేస్తామని తెలిపారు.

మాక్లూర్ ఏఎస్సై పదవి విరమణ



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 30 (డికే చాటింపు):మాక్లూర్ ఏఎస్ఐ ఈ. లక్ష్మణ్ బుధవారం పదవీ విరమణ పొందారు.పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వ హించారు. శాలువలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలుసర్టిఫికేటు, జ్ఞాపికలతోసత్కరించారు.ఈ సందర్భంగాపోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గోప్ప విషయమని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పకఉంటుందని , మీరు పోలీస్ డిపార్టుమెంటు కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని పదవి విరమణ అనంతరము ఎలాంటి అవసరం వచ్చిన ఎల్లవేళల సహాయపడు తామని , కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని ,పిల్లల భవిష్యత్తుభాగుండాలని కమిషనర్ ఆకాంక్షించారు.అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏ.వో) ఏషియా బేగం, ఆఫీస్ సూపర్డెంట్లు , శంకర్, ఎ. జగతి, టి. వనమాల , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , రిజర్వు ఇన్స్పెక్టర్ లు (అడ్మిన్/వెల్ఫేర్) ధరణి కుమార్, ఎస్.శేఖర్ బాబు , (ఎం.టి.ఓ హోంగార్డ్స్),మరియు వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

జన్నారం మండల అధ్యక్షులు మామిడి పెల్లి హరి కృష్ణ నియామకం



ఎల్బీనగర్, సెప్టెంబర్30(డీకే చాటింపు)ది అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొలే జగన్నాథం ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా, జన్నారం మండల అధ్యక్షులు మామిడి పెల్లి హరి కృష్ణ నీ నియమించడం జరిగినది. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గంగాధర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మునుగంటి శ్రీనివాస్ చారి గారు,రాష్ట్ర కార్యదర్శి నరసింహా చారి గారు,జన్నారం మండల్ అధ్యక్షులు వేయి కండ్ల రవి, ప్రధాన కార్యదర్శి బండోజు లక్ష్మి నరసింహా చారి,రాష్ట్ర కమిటీ,జిల్లా కమిటీ,మండల కమిటీ,వారికి శుభాకాంక్షలు తెలియజేసినారు జై విశ్వకర్మ జై జై విశ్వ కర్మ



(డీకే చాటింపు, హైదరాబాద్):పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి.

ఈ క్షణమే జీవితం

కనురెప్ప వేసే లోపే కరిగిపోయే కాలాన్ని

నిలువరించడం ఎవరికి సాధ్యం?

ఉదయం సూర్యుని చిరునవ్వు,

సాయంత్రపు నిశ్శబ్దం

రెప్పపాటులో జరిగిపోయే

మాయా ప్రపంచం ఇది.

ఉదయం నుంచి రాత్రికి పరుగెత్తే

ఈ ఉరుకులు పరుగులు,

అంతుచిక్కని కాలచక్రంలో

ఆవిరయ్యే దశాబ్దాలు,

మనుషులు జ్ఞాపకాలుగా,

బంధాలు నీడలుగా మిగిలే

క్షణికమైన ఈ పయనంలో

అసలు గమ్యం ఎక్కడ?

'తర్వాత చేద్దాం' అన్న బద్దకపు మాటే

చేజారిపోయే రేపటి తప్పుడు హామీ!

చల్లారిపోయే కాఫీ కప్పులో కాలం లాగే

నిరీక్షణలో కరిగిపోయే మధుర క్షణాలు.

రేపుల వేటలో ఈ నేటిని చంపుకోకు,

గడియారం ముళ్లు ఎవరికోసం ఆగవు!

నీకున్నది ఈ ఒక్క శ్వాస మాత్రమే,

అదే నీ అసలైన ఆస్తి,

అదే నీ నిజమైన కాలం!

క్షమించాలనుకుంటే ఇప్పుడే కౌగిలించుకో,

మనసులో దాచుకున్న మమతను

ఇప్పుడే పంచుకో,

మౌనంగా దాచుకున్న భావాలకు ప్రాణం పోస్తూ,

నీ జీవితాన్ని

ఒక అర్థవంతమైన కావ్యంగా మలచుకో!

గతం ఒక కరిగిపోయిన నీడ,

భవిష్యత్తు అంతుచిక్కని ఊహ,

నీవు సత్యంలా అనుభవించగలిగింది

ఈ వర్తమానం మాత్రమే!

ఆచార్య కడారు వీరారెడ్డి;
9392447007

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి :జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల్ (డీకే చాటింపు):ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రల కౌంటర్...

విజయవాడ, :ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు.2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల



మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..



తిరుపతి, : చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...



విజయవాడ, : ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎంతోమంది అయ్యన్నపాత్రుడు కంటే సీనియర్ నాయకులు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కి 80 సంవత్సరాలు ఉంటాయి. ఈయన కూడా అయ్యన్నపాత్రుడితో పాటే 1983 నుంచి టిడిపిలో ఉన్నారు. మరో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు కూడా రాజ్యసభ పదవిని కోరుకుంటున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. కిమిడి కళా వెంకట్రావు.. బండారు సత్యనారాయణమూర్తి వంటి వారు కూడా టిడిపిలో సీనియర్ నేతలుగా పేరు తెచ్చుకున్నారు. అయ్యన్న తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో 2029 ఎన్నికల్లో చంద్రబాబు వీరికి టికెట్ ఇస్తారా.. లేదా అనేది చూడాల్సి ఉంది.

స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్



శ్రీకాకుళం : స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.

పవన్ వరుస గైర్హాజర్లు... కారణం ఏమిటీ

ఒంగోలు, : కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ –జనసేన –బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి.అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది.

చమురు ఉత్పత్తి పెంపు స్వల్పంగానే..!



ఆగస్టులో ముడిచమురు ఉత్పత్తిని స్వల్పంగా పెంచేందుకు చమురు అధికంగా ఎగుమతి చేసే ఒపెక్+ దేశాలు అంగీకరించాయి. వచ్చే నెలలో తమ రోజువారీ ఉత్పత్తిని అదనంగా 1,88,000 బ్యారెళ్ల మేర పెంచాలని సౌదీ అరేబియా, రష్యా నేతృత్వంలో సమావేశమైన 7 ప్రధాన దేశాలు నిర్ణయించాయి. కొన్ని సంవత్సరాల క్రితం విధించుకున్న ఉత్పత్తి కోతలను పూర్తిగా ఎత్తివేయాలనే ఒపెక్+ ప్రణాళికలో భాగంగానే తాజా నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒపెక్+ తమ కోటాను రోజుకు 9,40,000 బ్యారెళ్ల మేర పెంచాయి. ప్రపంచ చమురు డిమాండ్‌లో ఇది 1 శాతానికి సమానం. 2023లో ధరలను స్థిరంగా ఉంచడం కోసం ఉత్పత్తి కోతలను చేపట్టగా, గిరాకీ పెరిగాక.. ఉత్పత్తి పెంచుతూ వస్తున్నారు. సెప్టెంబరులో మరోసారి పెంపుతో ఉత్పత్తి కొవిడ్ ముందుస్థాయికి చేరుతుంది. అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం విజయవంతంగా కొనసాగితే, రాబోయే రోజుల్లో మార్కెట్‌లోకి మరింత చమురు సరఫరా అందుబాటులోకి రానుంది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి మూతపడటంతో, గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తిని, ఎగుమతులను పెంచలేకపోయాయి. దీంతో మార్చి నుంచి కోటా పెంపు నిర్ణయాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పుడు హర్మూజ్‌లో రవాణా ప్రారంభమైనందున, ఆసియా దేశాల్లో చమురు నిల్వలు పెరిగాయి. ఫలితంగా యుద్ధ సమయంలో పెరిగిన చమురు ధరలు, మళ్లీ పాత స్థాయికి దిగివచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చమురు కొనే ఖాతాదారులను ఆకర్షించడం కోసం, ఒపెక్ దేశాల మధ్య అంతర్గత పోటీ మొదలయ్యే అవకాశం ఉంది.

కొన్ని సంవత్సరాల క్రితం విధించుకున్న ఉత్పత్తి కోతలను పూర్తిగా ఎత్తివేయాలనే ఒపెక్+ ప్రణాళికలో భాగంగానే తాజా నిర్ణయం తీసుకున్నారు.

టాటా స్టీల్ రూ.20,000 కోట్ల పెట్టుబడులు



టాటాస్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది. ఇందులో 60% దేశీయ వ్యాపార కార్యకలాపాలకు వినియోగించనుంది. 2025-26లో సంస్థ వెచ్చించిన రూ.14,559 కోట్ల మూలధన వ్యయం కంటే ఇది సుమారు 38% అధికమని టాటా స్టీల్ సీఈఓ, ఎండీ టీవీ నరేంద్రన్, కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) కౌశిక్ ఛటర్జీ వెల్లడించారు.

టాటా స్టీల్ వార్షికంగా 36 మిలియన్ టన్నులకు (ఎంటీపీఏ) పైగా ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. మనదేశంలో 27.35 మిలియన్ టన్నులు (ఎంటీ), నెదర్లాండ్స్‌లో 7 ఎంటీ, థాయ్‌లాండ్‌లో 1.7 ఎంటీ కేంద్రాలున్నాయి. పరివర్తన దశలో ఉన్న యూకేలోని 3.2 ఎంటీ ఇందులో కలపలేదు. దీర్ఘకాలంలో తమ సామర్థ్యాన్ని 50 ఎంటీలకు పైగా పెంచుకోవాలన్నది కంపెనీ లక్ష్యం.

మన దేశంలో 12 ఎంటీలకు పైగా సామర్థ్యాన్ని అదనంగా చేర్చడానికి కంపెనీ ప్రణాళికలు రూపొందించింది. మన దేశంలో కంపెనీకి జంషెడ్‌పూర్‌లో 11 ఎంటీపీఏ సామర్థ్యం కలిగిన ఉక్కు ప్లాంట్లు ఉన్నాయి. జార్ఖండ్‌లోని గమ్హరియాలో 1 ఎంటీపీఏ సామర్థ్యం గల ప్లాంటు ఉంది. ఒడిశాలోని కళింగనగర్‌లో కంపెనీకి 9 ఎంటీపీఏ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఇందులో దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా స్వాధీనం చేసుకున్న నీలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఎన్ఐఎన్ఎల్) కూడా భాగంగా ఉంది. ఒడిశాలోని మెరమండలిలో 5.6 ఎంటీపీఏ సామర్థ్యం కలిగిన ప్లాంటును కూడా టాటా స్టీల్ నిర్వహిస్తోంది.

ఏపీలో ప్రీమియర్ ఎనర్జీస్ రూ.6,000 కోట్ల పెట్టుబడులు



సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ భారీ పెట్టుబడుల ప్రణాళికను ప్రకటించింది. ఇంగాట్, వేఫర్ సామర్థ్యాలను పెంచేందుకు మూడేళ్లలో తిరుపతి సమీపంలో రూ.6,000 కోట్లతో ప్లాంటు పెట్టనున్నట్లు కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీఓ) విజయ్ రుస్తాగీ వెల్లడించారు. కంపెనీ రూ.12,500 కోట్ల మూలధన వ్యయాల ప్రణాళికలో ఇది భాగమని స్పష్టం చేశారు. సోలార్ సెల్, మాడ్యూల్ సామర్థ్యాన్ని రెండింతలు కంటే ఎక్కువగా పెంచి వరుసగా 10.6 గిగావాట్, 11.1 గిగావాట్‌కు చేర్చనుంది.

దీంతో పాటు ఇన్వర్టర్లు, బ్యాటరీలు, ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ వంటి కొత్త రంగాల్లోకి అడుగుపెట్టనుంది. ఆంధ్రప్రదేశ్‌లో 200 ఎకరాలు కేటాయింపు: ప్రీమియర్ ఎనర్జీస్ ఇంగాట్, వేఫర్ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తిరుపతి నుంచి 45 నిమిషాల దూరంలో ఉన్న నాయుడుపేటలో 200 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టు కోసం కేటాయించింది. నాయుడుపేట ప్లాంట్‌లో 10 గిగావాట్ ఇంగాట్, 10 గిగావాట్ వేఫర్ ఉత్పత్తి సామర్థ్యాలను కంపెనీ ఏర్పాటు చేయనుంది.

ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే, ఇంగాట్ స్థాయి నుంచి ప్యానెల్ వరకు అన్నింటినీ ఒకే చోట తయారుచేసే.. సమగ్ర సోలార్ కంపెనీగా ప్రీమియర్ ఎనర్జీస్ అవతరిస్తుంది. ప్రస్తుతం ప్రీమియం ఎనర్జీస్ సంస్థ హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న ప్లాంట్ల ద్వారా ఏటా 3.6 గిగావాట్ సెల్స్, 11.1 గిగావాట్ మాడ్యూల్స్ ఉత్పత్తి చేస్తోంది.

పన్ను చెల్లింపుదారులు డబుల్ రిటర్న్స్ ఫైల్ చేయాలా?



ఆదాయపు పన్ను చట్టం, 2025 అమలులోకి రానుండటంతో పన్ను చెల్లింపుదారుల్లో ఒక సందేహం ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యంగా ఏప్రిల్ 1, 2026 నుంచి పాత 'అసెస్‌మెంట్ ఇయర్' స్థానంలో కొత్తగా 'టాక్స్ ఇయర్' విధానం రావడంతో, ఒకే ఆర్థిక సంవత్సరానికి రెండు సార్లు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయాలేమోనని చాలామంది ఆందోళన చెందుతున్నారు. అయితే, ఈ గందరగోళానికి ఆదాయపు పన్ను శాఖ తెరదించింది. ఒకే ఆదాయానికి రెండు రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరం అస్సలు లేదని స్పష్టం చేసింది. చట్టం మారినా, పదాలు మారినా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మీరు సంపాదించిన ఆదాయానికి ఎప్పటిలాగే ఒకే ఒక్క రిటర్న్ దాఖలు చేస్తే సరిపోతుందని ఐటీ శాఖ పన్ను చెల్లింపుదారులకు ఊరటనిచ్చింది. మనం ఈ ఏడాది (2025, 1 ఏప్రిల్ నుంచి 2026, 31 మార్చి మధ్య) సంపాదించిన ఆదాయాన్ని ఫైల్ చేయడానికి పాత పద్ధతినే అనుసరించాలి.

సాధారణంగా మనం వాడే ఐటీఆర్-1 నుంచి ఐటీఆర్-7 వరకు ఉండే ఫారాలే ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. పన్ను చెల్లింపుదారులు కేవలం 'అసెస్‌మెంట్ ఇయర్ 2026-27'ని ఎంచుకుని, పాత 1961 చట్టం నిబంధనల ప్రకారమే తమ ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. ఆడిట్ అవసరం లేని సాధారణ పన్ను చెల్లింపుదారులకు ఎప్పటిలాగే 2026, జూలై 31 గడువు తేదీగా ఉంటుంది. మరి కొత్త చట్టం ఎప్పటి నుండి వర్తిస్తుందంటే..

2026, ఏప్రిల్ 1 నుండి మీరు సంపాదించే ఆదాయానికి 'టాక్స్ ఇయర్ 2026-27' కింద కొత్త చట్టం ప్రకారం 2027లో మాత్రమే రిటర్న్స్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

సాధారణంగా మనం వాడే ఐటీఆర్-1 నుంచి ఐటీఆర్-7 వరకు ఉండే ఫారాలే ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. రెండు చట్టాల మధ్య మార్పు జరుగుతున్న కాలంలో (ట్రాన్సిషన్ పీరియడ్) ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ-ఫైలింగ్ పోర్టల్ రెండు విధానాలకు సపోర్ట్ చేస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ గడువు తేదీ లోపు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయకపోతే పడే 'ఆలస్యపు రుసుము' విషయంలోనూ ఐటీ శాఖ స్పష్టత ఇచ్చింది. ఒకే ఆర్థిక సంవత్సరానికి రెండు సార్లు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయాలేమోనని చాలామంది ఆందోళన చెందుతున్నారు. అయితే, ఈ గందరగోళానికి ఆదాయపు పన్ను శాఖ తెరదించింది. ఒకే ఆదాయానికి రెండు రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరం అస్సలు లేదని స్పష్టం చేసింది.

చట్టం మారినా, పదాలు మారినా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మీరు సంపాదించిన ఆదాయానికి ఎప్పటిలాగే ఒకే ఒక్క రిటర్న్ దాఖలు చేస్తే సరిపోతుందని ఐటీ శాఖ పన్ను చెల్లింపుదారులకు ఊరటనిచ్చింది. ప్రస్తుత ఫైలింగ్ సీజన్ (2026-27)కి సంబంధించి గడువు దాటితే పాత చట్టంలోని సెక్షన్ 234ఎఫ్ నిబంధనలే వర్తిస్తాయి. అయితే, భవిష్యత్తులో కొత్త చట్టం (టాక్స్ ఇయర్ 2026-27, ఆ తర్వాత) కింద రిటర్న్స్ ఆలస్యమైతే సెక్షన్ 428 ప్రకారం జరిమానా విధిస్తారు. దీని ప్రకారం వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉంటే రూ. 1,000, అంతకంటే ఎక్కువ ఆదాయం ఉంటే రూ. 5,000 లేట్ ఫీజు కట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతానికైతే పన్ను చెల్లింపుదారులు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా, పాత పద్ధతిలోనే 'అసెస్‌మెంట్ ఇయర్ 2026-27' కింద ఒకే ఒక రిటర్న్ ఫైల్ చేయడంపై దృష్టి పెడితే సరిపోతుంది.

బంగారం కొనే ముందు ఇది తెసుకోండి...



బంగారు కొనేటప్పుడు చాలా మంది మనసులో మెదిలే మొదటి ప్రశ్న ఏదైనా ఉందంటే.. 22 క్యారెట్ల, 24 క్యారెట్ల బంగారానికి మధ్య ఉన్న తేడా ఏమిటి? కొంతమంది అయితే వీటి గురించి తెలియకుండానే బంగారాన్ని కొంటూ ఉంటారు. 24 క్యారెట్ల బంగారం అటే ఇది అత్యంత స్వచ్ఛమైన బంగారం అని అర్థం. అంటే మనం నేరుగా గని నుండి వెలికితీసిన బంగారాన్ని వాడలేం కాబట్టి కాస్త శుద్ధి చేయడం వల్ల మార్కెట్లో దీనిని 99.9 శాతం స్వచ్ఛమైనదిగా గుర్తిస్తారు. ఇందులో ఎలాంటి ఇతర లోహాలను కలపకుండా తయారు చేస్తారు. కాబట్టి మార్కెట్లో దీని ధర అన్నింటికంటే ఎక్కువగా ఉంటుంది.అత్యంత స్వచ్ఛత కారణంగా 24 క్యారెట్ల బంగారం సహజంగానే చాలా మృదువుగా ఉంటుంది. అలాగే మిగతా బంగారంతో పోల్చితే మెరుపులో ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఈ మృదుత్వ స్వభావం వల్లే 24 క్యారెట్ల బంగారంతో నేరుగా ఆభరణాలను తయారు చేయడం సాధ్యం కాదు. ఒకవేళ తయారు చేసినా, అవి కొద్దిపాటి ఒత్తిడికే వంగిపోవడం లేదా వాటి అందమైన డిజైన్లు పాడైపోయే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించడానికి మార్కెట్లోకి 22 క్యారెట్ల బంగారాన్ని తీసుకువచ్చారు. ఇందులో 22 భాగాలు అంటే సుమారు 91.6 శాతం స్వచ్ఛమైన బంగారం ఉంటే మిగిలిన 2 భాగాలలో బంగారానికి గట్టిదనాన్ని ఇచ్చే రాగి, వెండి లేదా జింక్ వంటి కఠినమైన లోహాలను కలుపుతారు. ఇతర లోహాల కలయిక వల్ల ఇది 24 క్యారెట్ల కంటే చాలా బలంగా మారి, నిత్యం ధరించే ఆభరణాల తయారీకి ఉత్తమంగా నిలుస్తుంది. ఈ రెండు రకాల బంగారు ఆభరణాల రంగు, ధరలలో కూడా తేడాలు ఉంటాయి. 24 క్యారెట్ల బంగారం మిరుమిట్లు గొలిపే ముదురు పసుపు రంగులో ఉంటే, ఇతర లోహాల కలయికతో తయారు చేసిన 22 క్యారెట్ల బంగారం మాత్రం కాస్త లేత రంగులో ఉంటుంది. ఇక ధర విషయానికి వస్తే, స్వచ్ఛత ఎక్కువగా ఉండటం 24 క్యారెట్ల ధర ఎల్లప్పుడూ 22 క్యారెట్ల కంటే ఎక్కువగానే ఉంటుంది. ఒక వేళ మీరు భవిష్యత్తు కోసం డబ్బు ఆదా చేయాలనుకుంటే లేదా కేవలం పెట్టుబడి పెట్టడమే మీ ఉద్దేశం అయితే, 24 క్యారెట్ల బంగారు నాణేలు లేదా కడ్డీలను కొనడం మంచి ఆప్షన్. అలాకాకుండా, పెళ్లిళ్లు లేదా శుభకార్యాల కోసం అందమైన డిజైన్లతో కూడిన ఆభరణాలను కొనాలి అనుకుంటే.. మీకు 22 క్యారెట్ల బంగారం మంచింది. కాబట్టి ఈ సారి కొనేప్పుడు మీ అవసరానికి తగ్గట్టుగా సరైన నిర్ణయం తీసుకుంటే నష్టపోయే అవకాశం తగ్గుతుంది.

ఇతర లోహాల కలయికతో తయారు చేసిన 22 క్యారెట్ల బంగారం మాత్రం కాస్త లేత రంగులో ఉంటుంది. ఇక ధర విషయానికి వస్తే, స్వచ్ఛత ఎక్కువగా ఉండటం 24 క్యారెట్ల ధర ఎల్లప్పుడూ 22 క్యారెట్ల కంటే ఎక్కువగానే ఉంటుంది.

మైక్రోసాఫ్ట్‌లో మరో విడత ఉద్యోగాల కోత

గ్లోబల్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కంపెనీ తన మొత్తం ఉద్యోగుల్లో 2.5 శాతం వరకు తొలగించే ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నిర్ణయాన్ని వచ్చే వారం ప్రారంభంలో ప్రకటించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఈ కోతలు ప్రధానంగా సేల్స్, కస్టల్టింగ్, అలాగే ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ఈ వార్తలపై మైక్రోసాఫ్ట్ అధికారికంగా స్పందించలేదు. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు పెడుతూనే, నిర్వహణ ఖర్చులను తగ్గించే వ్యూహంలో భాగంగానే ఈ పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంలో కూడా ఉద్యోగాల కోతలు, మార్కెటింగ్ బడ్జెట్ తగ్గింపు,

మీడియా సంస్థలు వెల్లడించాయి. గత ఏడాది కూడా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగుల్లో సుమారు 4 శాతం మందిని తొలగించింది. మరోవైపు, ఏఐపై దృష్టి పెంచుతున్న టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మెటా ఈ ఏడాది తన ఉద్యోగుల్లో 10 శాతం మందిని తగ్గించే ప్రణాళిక ప్రకటించగా, అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 16 వేల ఉద్యోగాలను తగ్గించే చర్యలు చేపట్టింది.



మండలి కోసం పోటా పోటీ



వరంగల్: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి, అలాగే నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల వేడి గాంధీభవన్‌లో ఇప్పుడే మొదలైంది. అక్టోబర్ నెల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో, అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతల హడావిడి పీక్స్‌కు చేరింది.ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలో ఉమ్మడి ఆరు జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పట్టభద్రుల తీర్పు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారే అవకాశం ఉండటంతో, ఫలితం తేడా వస్తే భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం పడుతుందన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కీలక మంత్రులు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను అధిష్ఠానికి పంపేందుకు నాన్నాహాలు జరుగుతున్నాయి.మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి ఆశావహులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరిపి జాబితా రూపొందించారు. పార్టీ సీనియర్ నేత, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నేపథ్యం ఉంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నాయి. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నేత గౌరి సతీష్, షాప్ మాజీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు రాకూర్ బాలాసింగ్ పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది.ఇక నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసిన ఇందిర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, పార్టీ నేత లోకేష్ యాదవ్, ఖమ్మం విద్యాసంస్థల అధినేత మొండిం కిరణ్‌కుమార్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం.పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూదనాచారి పదవీకాలం పూర్తవుతుంది. ఈ నాలుగు నామినేటెడ్ స్థానాలు కూడా అధికార కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబంధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకాశం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నాయి.సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గ్రౌండ్ రియాలిటీని బేరీజు వేసుకుంటూ, ఆశావహుల అసంతృప్తి పార్టీపై పడకుండా శాసనమండలి పోరులో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా హస్తం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

విజన్ ఎడ్యుకేషన్ అడుగులు



హైదరాబాద్, : తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థపై తన విజన్ ను ఆవిష్కరించారు. విద్యారంగ సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు తన వద్ద ఉన్న కార్యాచరణను స్పష్టంగా వివరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రాబోయే తరాల భవిష్యత్తే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన నొక్కి చెప్పారు.గత పాలకులు ఇరిగేషన్ శాఖను తమ వద్ద ఉంచుకుని, వేల పుస్తకాలు చదివామని గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కానీ నేను మాత్రం ఓట్లు లేని, కేవలం బాధ్యత మాత్రమే ఉన్న విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని పరోక్షంగా విపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. తానెలాంటి తప్పులు చేయలేదని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వివాదాల్లేకుండా పూర్తి చేశానని గుర్తుచేశారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, తెలంగాణ విద్యా వ్యవస్థ 28వ స్థానం నుండి 18వ స్థానానికి చేరుకుందని గణాంకాలతో సహా వెల్లడించారు.ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు రూ.50 వేలకు మించి ఖర్చు చేయడం లేదని, కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు వెచ్చిస్తోందని సీఎం స్పష్టం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 9 శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాల్లో ప్రపంచంతో పోటీ పడటంలో మనం ఎక్కడో వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పూర్తయినా కనీసం ఉద్యోగానికి దరఖాస్తు కూడా రాయలేని పరిస్థితి మారి తీరాలని ఉద్ఘాటించారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడమే కాకుండా, విదేశీ పర్యటనలకు ప్రతి ఏటా ఉపాధ్యాయులను పంపి గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను ఇక్కడ అమలు చేస్తామన్నారు.తనకు ఎలాంటి ఇతర కోరికలు లేవని, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో మీకేమీ అనుమానాలు అక్కర్లేదన్నారు. నల్గొండ వంటి ప్రాంతాల్లో 9 మంది ఉపాధ్యాయులున్నా ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల పరిస్థితిని నిరసించారు. బదిలీలు చేస్తే ధర్నాలు చేయడం సరికాదన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి.. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు మీ ఇంటికే వస్తాయి. కానీ ఐదేళ్ల పాటు పిల్లల భవిష్యత్తు కోసం నా దారిలోకి వచ్చి పోరాడండి. మండలాల వారీగా క్లస్టర్లను ఏర్పాటు చేసి, పాఠశాలల అభివృద్ధికి మీరే నివేదికలు ఇవ్వండి, వాటిని అమలు చేసే బాధ్యత నాది” అని పిలుపునిచ్చారు.హాస్టల్ సంస్కృతి వల్ల పిల్లలు ఒంటరితనానికి గురై, భవిష్యత్తులో తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్‌లలో వేసే పరిస్థితి వస్తోందని రేవంత్ రెడ్డి మానవీయ కోణాన్ని స్పృశించారు. టీచర్లు కేవలం బోధకులుగా కాకుండా తల్లిదండ్రుల స్థానంలో ఉండి గైడ్ చేయాలని కోరారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనమేనని, జర్మనీ, జపాన్ లాంటి దేశాలపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. “ప్రభుత్వ బడిలో చదివితే ఏమవుతావని ఎవరైనా అడిగితే.. తెలంగాణ సీఎం అవుతానని గర్వంగా చెప్పండి” అని వ్యాఖ్యానించి ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

రేవంత్ మార్క్ పాలిటిక్స్..!



హైదరాబాద్, : కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలకు, నాయకత్వంపై అసమ్మతి గళాలకు ఏఐసీసీ హైకమాండ్ గట్టి ముగింపు పలికింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ, కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్ఠానం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీఎం పీఠాన్ని అధిరోహించే వరకు ప్రతి అడుగులోనూ పరీక్షలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డి, తాజా పరిణామంతో పార్టీపై తన తిరుగులేని పట్టును మరోసారి నిరూపించుకున్నారు. క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఢిల్లీ పెద్దలు, అసంతృప్త నేతల దూకుడుకు బలమైన కళ్లెం వేశారు.ప్రభుత్వ విధానాలు లేదా ముఖ్యమంత్రి శైలిపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్న నేతలకు కొండా సురేఖ ఉద్వాసన ద్వారా అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసింది. క్రమశిక్షణ తప్పితే అది విస్తరించి పార్టీ ఐక్యతకే ముప్పుగా మారుతుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రేవంత్‌ను కాదని మరో ప్రత్యామ్నాయ వర్గాన్ని ప్రోత్సహించే ఆలోచన ఏఐసీసీకి లేదని, సీఎంకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే సరైన మార్గమని నాయకత్వం భావించింది. ఫలితంగా, ఇన్నాళ్లూ మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం లేదా శాఖల మార్పుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ వచ్చిన ఆశావహులు ఇప్పుడు ఆచితూచి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.హైకమాండ్ రేవంత్ రెడ్డికి ఇంతటి అండగా నిలవడానికి బలమైన రాజకీయ, ఎన్నికల కారణాలు ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం మొదలుకొని.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, పురపాలక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వరకు రేవంత్ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలను నమోదు చేసింది. దక్షిణ భారతదేశంలో పార్టీకి అత్యంత కీలకమైన తెలంగాణలో ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను నిలువరించడంలో రేవంత్ వ్యూహాలు విజయవంతమయ్యాయి. ఈ పనితీరును గుర్తించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, రేవంత్ నాయకత్వాన్ని బలహీనపరిస్తే పార్టీ పునాదులకే నష్టమని స్పష్టం చేసింది.త్వరలోనే జరగనున్న కీలకమైన పట్టణ స్థానిక సంస్థల సమరానికి పార్టీని సమాయత్తం చేయడమే అధిష్ఠానం తక్షణ లక్ష్యం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లోని క్యూర్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఈ నగర పోరుకు ముందు గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, ఏకతాటిపై పార్టీని నడిపించేందుకు రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది.ఈ తాజా రాజకీయ మార్పులతో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి వెసులుబాటు దక్కింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, మంత్రుల పనితీరు ఆధారంగా శాఖల మార్పిడి చేపట్టే స్వేచ్ఛ ఆయనకు లభించింది. పార్టీపై సంపూర్ణ ఆధిపత్యం దక్కించుకున్నప్పటికీ, అసమ్మతి పూర్తిగా సమసిపోలేదన్న వాస్తవాన్ని గ్రహించిన రేవంత్.. అన్ని సామాజిక వర్గాలను, సీనియర్ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. పార్టీలో అంతర్గత సమతుల్యతను కాపాడుకుంటూనే, తన నాయకత్వానికి ఎదురులేదని రేవంత్ చాటిచెప్పినట్లయింది

పోలవరం, అమరావతిని పూర్తి చేస్తాం



విజయనగరం, : భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభించినట్లుగానే వచ్చే ఏడాది పోలవరం.. ఆ తర్వాత ఏడాది అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభింపచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేసిన చారిత్రాత్మక సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత భావోద్వేగంతో ప్రసంగించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ వేదికగా ఉత్తరాంధ్ర ఆత్మగౌరవాన్ని, ప్రగతి శక్తిని చాటిచెప్పిన సీఎం.. సముద్ర తీరానికి, పచ్చని కొండలకు నడుమ నిర్మితమైన ఈ విమానాశ్రయం విమాన ప్రయాణికులకు ఒక భూతల స్వర్గాన్ని, సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.పదేళ్ల విమానాశ్రయ నిర్మాణ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ సీఎం విపక్షాల విమర్శలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. . 2015లో ప్రధాని మోదీ నాయకత్వంలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రకటించి, అన్ని అనుమతులు సాధించి 2019లోనే శంకుస్థాపన చేశాం. నాడు ఈ ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టింది మనమే, నేడు పనులు పూర్తిచేసి గుమ్మడికాయ కట్టింది మనమే అని చంద్రబాబు గర్వంగా ప్రకటించారు. ఇక్కడ ఎర్రబస్సు కూడా రాదంటూ గతంలో అవహేళన చేసిన వారు ఈరోజు రాజకీయంగా అడ్రస్ లేకుండా పోయారని, ఆటంకాలు సృష్టించిన ప్రతి ఒక్కరి వైఫల్యాన్ని దాటుకుని ఉత్తరాంధ్రకు భారీ ఎయిర్ బస్ తెచ్చామని స్పష్టం చేశారు.ఇదే వేదికపై నుంచి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి రెండు కీలకమైన మైలురాళ్లను సీఎం చంద్రబాబు ప్రకటించి అందరినీ ఆకట్టుకున్నారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసి, 2027 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే జాతికి అంకితం చేస్తామని తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి మొదటి దశ నిర్మాణాత్మక పనులన్నింటినీ 2028 నాటికి పూర్తి చేసి, ప్రధాని సమక్షంలోనే అట్టహాసంగా ప్రారంభోత్సవం జరుపుతామని సీఎం పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర పారిశ్రామిక రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని వివరిస్తూ.. గడిచిన రెండేళ్ల వ్యవధిలోనే ఈ ప్రాంతానికి 189 భారీ ప్రాజెక్టులను ఆకర్షించామని చంద్రబాబు వెల్లడించారు. రూ.6.13 లక్షల కోట్ల విలువైన ఈ పెట్టుబడులు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే ఉత్తరాంధ్రలోని 5.57 లక్షల మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గణాంకాలతో వివరించారు.
భోగాపురం ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన రైతుల త్యాగం అమూల్యమైనదని, వారికి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు.విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను కలుపుతూ రూపుదిద్దుకుంటున్న విశాఖ ఎకనామిక్ నోడ్‌కు ఈ ఎయిర్‌పోర్టు ఒక గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని సీనియర్ రాజకీయనాయకులు, ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. పర్యాటకం, ఐటీ, ఆటోమొబైల్ మరియు ఫార్మా రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించే సత్తా భోగాపురానికి ఉందని, కేంద్రంలో నరేంద్ర మోదీ అండదండలతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అమరావతి, పోలవరంతో పాటు ఉత్తరాంధ్రను కూడా దేశంలోనే అగ్రగామిగా నిలబెడుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

మజ్లీస్ తో రేవంత్ సంబంధం!



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. “రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను” అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది.అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. “నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు” అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్-ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

కాకినాడ, : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది.

లక్ష కోట్లతో పీపీపీలు... నెంబర్ వన్

విజయవాడ, : భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది.దేశవ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది. నిధుల కొరత లేకుండా పీపీపీ నమూనాలో ఈ మౌలిక ప్రాజెక్టులు పట్టాలెక్కితే, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థక

దేవాదాయశాఖ సెంటిమెంట్ కంటిన్యూ..!



హైదరాబాద్, : రాజకీయాల్లో కొన్ని శాఖలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అందులో దేవాదాయ ధర్మాదాయ శాఖది అత్యంత సున్నితమైన స్థానం. దేవుడి మాన్యాలు, ఆలయ పాలనతో ముడిపడి ఉండే ఈ పోర్ట్‌ఫోలియోను బాధ్యతగా భావించినా.. రాజకీయంగా మాత్రం మంత్రులకు అస్సలు కలిసిరావడం లేదు. ఇది త ఆరు దశాబ్దాల చరిత్ర చెప్తున్న చేదు నిజం. తాజాగా మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఉద్వాసనకు గురికావడంతో మరోసారి దేవాదాయ శాఖ సెంటిమెంట్ తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలుకొని ఇప్పటి ప్రత్యేక తెలంగాణ వరకు.. ఈ శాఖను చేపట్టిన పలువురు నేతల రాజకీయ ప్రస్థానం ఊహించని మలుపులు తిరిగి, క్రమంగా అస్తమించడమో లేదా తెరమరుగవడమో జరుగుతూ వస్తోంది.ఈ శాఖకు మంత్రుల పదవీకాలానికి ఉన్న విచిత్రమైన లింక్ 1962 నుంచే కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సదాలక్ష్మి కేవలం ఏడాది తిరిగేలోపే ఆ పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శాఖలో ఆమె తీసుకున్న సంస్కరణలు, నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో సంక్షేమ శాఖకు మార్చారు. ఆ వెంటనే 1967 ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. ఇక 1983 జనవరిలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఈలి ఆంజనేయులు పదవిలో ఉండగానే కేవలం నెలల వ్యవధిలోనే అనారోగ్యంతో కన్నుమూశారు1999-2004 మధ్య చంద్రబాబు రెండోసారి సీఎంగా ఉన్న సమయంలో దామోదరం ఆంజనేయులు 1999లో దేవాదాయ శాఖ బాధ్యతలు తీసుకున్నారు. 2001 నాటి కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, రాజకీయ సమీకరణాల్లో పదవి కోల్పోయారు. ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన దండు శివరామరాజు 2004 సాధారణ ఎన్నికల్లో ఓటమి చెంది, ఆపై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు.దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ ఈ గండం కొనసాగింది. 2004-2005 మధ్య 14 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన ఎం.సత్యనారాయణ రావు.. హైదరాబాద్ పరిధిలోని దేవరయాంజాల్ భూముల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొని పదవిని వీడాల్సి వచ్చింది. క్రీడల శాఖకు మారినా, ఏడాదిలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం 2009 ఎన్నికల్లో వేములవాడ నుంచి పోటీ చేసి ఓడిపోయి రాజకీయాలకు దూరమయ్యారు. వైఎస్ కేబినెట్‌లోనే 2009 మే నుంచి దేవాదాయ శాఖ నిర్వహించిన జూపల్లి కృష్ణారావు, 2011 జూన్ 1న తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అటు 2014లో ఏపీ టీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఈ శాఖ చూసిన మాణిక్యాలరావు 2019 ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. ఆ తర్వాత ఆయన కన్నుమూశారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఏడాది పాటు ఎవరికీ ఈ బాధ్యతలు అప్పగించలేదు. 2014 డిసెంబరులో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి దేవాదాయ శాఖ దక్కింది. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ రెండో కేబినెట్‌లోనూ 2023 ఎన్నికల వరకు ఆయనే కొనసాగినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. సుదీర్ఘకాలం శాఖను నడిపించినా ఆయనకు రాజకీయంగా పెద్దగా మైలేజ్ దక్కలేదనే వాదన ఉంది.ఇక 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలను చేపట్టిన కొండా సురేఖ సైతం పలు రాజకీయ వివాదాల్లో చిక్కుకుని అనూహ్యంగా మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురయ్యారు. గతంలో కేసీఆర్ హయాంలో ఆరోగ్యశాఖ నిర్వహణ లోపాల వల్ల పదవి కోల్పోయిన డాక్టర్ టి.రాజయ్య, ఇప్పుడు పదవి కోల్పోయిన కొండా సురేఖ.. ఇద్దరూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలే కావడం కాకతాళీయం.సంక్షేమ పథకాలు, భారీ బడ్జెట్లు, రాజకీయ పలుకుబడిని పెంచే ఇతర శాఖలతో పోలిస్తే.. దేవాదాయ శాఖ పూర్తి భిన్నమైనది. భూముల వివాదాలు, ఆలయ నిధులు, స్థానిక ఆధిపత్య పోరు ఈ శాఖను నిరంతరం పర్యవేక్షణలో ఉంచుతాయి. కారణాలు పాలనాపరమైనవి కావొచ్చు, రాజకీయ సమీకరణాలు కావొచ్చు.. కానీ దేవాదాయ శాఖ పగ్గాలు పట్టిన నేతలకు కాలం కలిసిరావడం లేదన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోతోంది.

క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్: 70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు. అత్యున్నత పాలనా మండలి సజావుగా పని చేసేందుకు ఒక పూర్తిస్థాయి సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే నగర ప్రాధాన్యతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ వ్యవహారాల మంత్రి వంటి ప్రత్యేక రాజకీయ బాధ్యుడిని నియమించాలని ఆయన స్పష్టం చేశారు.

మిడిల్ క్లాసు కష్టాలు...



హైదరాబాద్ : ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

ఫీఎం రేసులోకి కొత్త పేర్లు



చెన్నై, : భారత జాతీయ రాజకీయం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం కష్టం. 2029 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి రేసు చుట్టూ ఇప్పుడే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రధాని ముఖచిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, కాంగ్రెస్‌కు ఏకపక్షంగా సొంత బలం దక్కక, ప్రాంతీయ మిత్రపక్షాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిత్వం అతిపెద్ద చిక్కుముడిగా మారుతుంది. గత చరిత్రను గమనిస్తే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడంలో ఎప్పుడూ సంకోచిస్తూనే ఉన్నాయి.ఇలాంటి పరిస్థితుల్లోనే మిత్రపక్షాలకు అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సర్వసమ్మత నాయకుడి అన్వేషణ ప్రారంభమవుతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో హెచ్.డి. దేవేగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి నాయకులు అనూహ్యంగా ప్రధాని పీఠాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. సరిగ్గా ఈ సమీకరణాల్లోనే, తమిళనాడు ముఖ్యమంత్రి , తమిళగ వెట్రి కజగం అధినేత జోసెఫ్ విజయ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. సంకీర్ణ రాజకీయాల్లో విపక్ష ప్రాంతీయ పార్టీలు తమ కంటే బలమైన జాతీయ నేతను ప్రధానిగా అంగీకరించడానికి ఇష్టపడవు. అక్కడ వివాదరహితుడు, అందరికీ సర్దుబాటు అయ్యే కొత్త ముఖానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఇటీవల వెలువడిన సర్వేలో ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తదుపరి స్థానంలో అనూహ్యంగా విజయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇది టీవీకే శ్రేణుల్లోనే కాకుండా జాతీయంగా చర్చనీయాంశమైంది.తమిళనాడులోని టీవీకే మంత్రులు, సీనియర్ నేతలు విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఉత్తరాది ప్రజలు కూడా ఆయన వైపే చూస్తున్నారని వ్యాఖ్యానించడం కాంగ్రెస్-టీవీకే కూటమిలో విబేధాలకు దారితీసింది. విజయ్‌కి ఏ జాతీయ పార్టీతోనూ దీర్ఘకాల శత్రుత్వం లేదు. దక్షిణాదికి చెందిన ప్రజాదరణ పొందిన నాయకుడు కావడం, సిద్ధాంతపరమైన తీవ్రమైన మరకలు లేకపోవడం వల్ల ప్రాంతీయ పార్టీల అధినేతలకు రాహుల్ కంటే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా మద్దతు ఇవ్వడం సులువుగా మారవచ్చు.విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ దీనిని టీవీకే నేతల ఫ్యాన్ క్లబ్ మానసిక స్థితి గా అభివర్ణించడమే కాక, 2029లో రాహుల్‌ను ప్రధానిగా అంగీకరించకపోతే తమిళనాడు కేబినెట్ నుంచి కాంగ్రెస్ మంత్రులు తప్పుకుంటారని హెచ్చరించే స్థాయికి విభేదాలు వెళ్లాయి. అయినప్పటికీ, ఎన్నికల అనంతర సమీకరణాల్లో సీట్ల సంఖ్యే కీలక పాత్ర పోషిస్తుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలు ఎప్పుడూ ఒకే లైన్‌లో సాగవు. కేంద్రంలో అధికార పీఠాన్ని దక్కించుకోవడంలో కాంగ్రెస్ సంఖ్యాబలం తగ్గి, రాహుల్ గాంధీ పేరుపై మిత్రపక్షాల మధ్య అంగీకారం కుదరకపోతే.. ప్రత్యామ్నాయంగా దక్షిణాది నుంచి విజయ్ లాంటి పాపులర్ మాస్ లీడర్ ఎదిగే అవకాశాలను ఏమాత్రం కొట్టిపారేయలేం.

భారత్ కు జిన్ పింగ్

న్యూఢిల్లీ : 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్?చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12?13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది.గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్?చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది.భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు.ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై? అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

తెలంగాణ ద్రోహి కేటీఆర్ గారూ.. సినిమా డైలాగులు కాదు,

తెలంగాణ యువతకు ఉద్యోగాలు కావాలి: ఎంపీ వంశీకృష్ణ



పెద్దపల్లి: తెలంగాణ యువత భవిష్యత్తును రాజకీయాలకు బలి చేయకుండా, వారికి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల విషయంలో జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,500 మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల పాటు కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు తెలంగాణ యువత భవిష్యత్తుపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండేదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు."ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? యువత నైపుణ్యాలను పెంచేందుకు ఏం చేశారు? ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?" అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలపై వచ్చిన అవకతవకల ఆరోపణలు విద్యార్థుల, నిరుద్యోగ యువత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు."సినిమా డైలాగులు చెప్పడం సులభం. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది డైలాగులు కాదు.. వాస్తవాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు" అని వంశీకృష్ణ అన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజల భవిష్యత్తే శాశ్వతమైన అంశమని ఎంపీ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ అవకాశాలు కల్పించారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు."మేము నామినేటెడ్ పదవులతో రాలేదు. ప్రజలు మాకు ఓటు వేసి గెలిపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతతో ప్రజల కోసం పనిచేస్తున్నాం'' అని పేర్కొన్నారు.తెలంగాణ యువతను ప్రపంచస్థాయిలో నిలబెట్టడమే తమ లక్ష్యమని వంశీకృష్ణ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు వెళ్లి అంతర్జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు."మీకు నిజంగా ధైర్యం ఉంటే రాజకీయ డైలాగులు చెప్పడం కాకుండా తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే పనులు చేయండి. యువత భవిష్యత్తు కోసం పనిచేయండి. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజల తీర్పే అంతిమ తీర్పు'' అని అన్నారు.తెలంగాణ యువత హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం తాము నిరంతరం పోరాడుతామని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

గ్రాస్ రూట్ కు దూరంగా కవిత...



హైదరాబాద్: మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా" అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదుఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది.కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచీ విద్యార్థుల విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. ఆ పార్టీ ఎలాంటి ఉద్దేశ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ ఆందోళనలకు బహిరంగంగానే తన సంఘీభావం తెలిపింది. పార్లమెంటు లోపల, బయట విద్యార్థుల తరపున గట్టిగా పోరాడింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నేతలు అందరూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు కూడా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొన్నారు. కనుక విద్యార్థుల ఆందోళనలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక భాగస్వామి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆ స్టార్ హీరో వల్ల నాకు గుర్తింపు వచ్చింది..



యంగ్ హీరోయిన్ శ్రద్ధా దాస్ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ భాషల్లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు . మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన 2009లో వచ్చిన 'ఆర్య-2' సినిమాలో నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో హిట్లు రాకపోవడంతో ఇక్కడ అవకాశాలు తగ్గాయి. దీంతో ఆమె బాలీవుడ్ వైపు అడుగులు వేశారు. ప్రస్తుతం హిందీలో వరుస ప్రాజెక్టులు చేస్తూ బిజీగా మారిన శ్రద్ధా దాస్, ఇటీవల 'త్రికాల' అనే మైథలాజికల్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను అలరించారు. ఈ నేపథ్యంలో తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రద్ధా దాస్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అల్లు అర్జున్‌కు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ఆమె చాలా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. అల్లు అర్జున్ సినిమాలకు తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా ఏ రేంజ్‌లో ఆదరణ ఉంటుందో శ్రద్ధా దాస్ గుర్తుచేసుకున్నారు. బన్నీ నటించిన చిత్రాలకు తమిళం, మలయాళంలోకి డబ్ అయినప్పుడు కూడా అక్కడ థియేటర్లు హౌస్‌ఫుల్ అవుతాయని ఆమె చెప్పారు. దక్షిణాదిలోనే కాకుండా, ఉత్తరాదిలో కూడా ఆయన డబ్బింగ్ సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉందని తెలిపారు. అల్లు అర్జున్ చిత్రాల వల్లే తనకు నార్త్ ఇండియాలో కూడా మంచి గుర్తింపు లభించిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తనతో కలిసి నటించిన అల్లు అర్జున్.. ప్రస్తుతం భారతదేశంలోనే అత్యంత బిగ్గెస్ట్ స్టార్ ఎదగడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని శ్రద్ధా దాస్ పేర్కొన్నారు. బన్నీ స్టార్‌డమ్‌పై శ్రద్ధా దాస్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇక నిర్మాతగా మారిన ప్రదీప్ రంగనాథన్



కోలీవుడ్ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ వరుస హిట్స్ సాధించి సౌత్ ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఇక ఇటీవల భారీ అంచనాల మధ్య వచ్చిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. ఈ మూవీ నిర్మాతలకు నష్టాలను మిగల్చడంతో, ప్రదీప్ రంగనాథన్ తన రూట్ మార్చి ఒక సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఎలాగైనా సరే గట్టి హిట్ కొట్టాలనే కసితో ఆయన నటనకు కాస్త బ్రేక్ ఇచ్చి, నిర్మాతగా కొత్త ప్రయాణం షురూ చేసి ఓ వైవిధ్యమైన సినిమాను తెరకెక్కిస్తున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కూడా మొదలైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో తాజాగా, ప్రదీప్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ సినిమా టైటిల్, ఒక క్రేజీ గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ప్రదీప్ రంగనాథన్ సొంతంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అనేవాలా... స్టార్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేయగా ఈ సినిమాకు కథను కూడా ప్రదీప్ స్వయంగా అందించడం విశేషం. ప్రముఖ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమా ద్వారా హీరోగా పరిచయం అవుతున్నారు.

అలాగే సీనియర్ నటి స్వాసిక, కొత్త నటి అనమికా మహి, శివాజీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ఒకరు కాదు, ఇద్దరు కాదు.. 'ఆల్ఫా యూనిట్' పేరుతో ఉన్న ఆరుగురు దర్శకులు కలిసి డైరెక్ట్ చేయబోతున్నారు. ఇది పూర్తిగా లేడీ ఓరియెంటెడ్ సినిమాగా రూపొందనుందని సమాచారం. అయితే ఇందులో 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు మెయిన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ప్రదీప్, మమిత కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈసారి వీరిద్దరూ తెరపై జంటగా కాకుండా.. నిర్మాతగా, నటిగా కలిసి వర్క్ చేస్తుండటం విశేషం. మూవీ టీమ్ రిలీజ్ చేసిన స్పెషల్ వీడియో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో మమితా బైజు చేతిలో కత్తి పట్టుకుని వైల్డ్ లుక్‌లో లేడీ డాన్ లా కనిపించి షాక్ ఇచ్చింది.

శర్వానంద్ 'జార్జ్ క్రిష్' స్టార్ట్ అయ్యేది అప్పుడే..!



టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో శ్రీనువైట్ల దర్శకత్వంలో ఓ సినిమా కొంతకాలం క్రితమే పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాలు పూర్తైనప్పటికీ రెగ్యులర్ షూటింగ్ మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాలేదు.

నార్నే నితిన్ సయా సినిమా షురూ...



వరుసగా మూడు విజయవంతమైన చిత్రాలలో నటించిన హీరో నార్నే నితిన్ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధాకృష్ణ రెడ్డితో ఒక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. ఈ చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తుండగా, లోహిత ఎన్.కె క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో నార్నే నితిన్ సరసన అనికా సురేంద్రన్, మేఘా శెట్టి కథా నాయికలుగా నటిస్తున్నారు. ఆదివారం సంప్రదాయ పూజా కార్యక్రమంతో ఈ చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ కెమెరాను ఆన్ చేశారు. 'మ్యాడ్' దర్శకుడు కళ్యాణ్ శంకర్ ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించగా, వెంకట్ కె నారాయణ స్క్రిప్ట్‌ను దర్శకుడు రాధాకృష్ణకు అందజేశారు. రొమాన్స్, కామెడీ, మనసుని హత్తుకునే భావోద్వేగాల కలయికతో బలమైన ఎమోషనల్ అంశాలతో కూడిన కంప్లీట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది అని మేకర్స్ తెలిపారు.

వర్షంలో తడిస్తే ఆరోగ్యానికి మంచిదేనా...?



వర్షాకాలంలో చల్లని జల్లులు, ఆహ్లాదకరమైన వాతావరణం చాలా మందిని వర్షంలో తడవడానికి ఆకర్షిస్తాయి. పరిమిత సమయం పాటు వర్షంలో తడవడం వల్ల మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వర్షపు చినుకులు ఒత్తిడిని తగ్గించి మనసుకు సేదతీరే అనుభూతిని కలిగిస్తాయి. వర్షాకాలం రాగానే చల్లని గాలులు, మెల్లని జల్లులు ప్రకృతిని మరింత అందంగా మారుస్తాయి. ఈ సమయంలో చాలా మందికి వర్షంలో తడవాలని, స్నేహితులతో కలిసి సరదాగా గడపాలని అనిపిస్తుంది. అయితే జలుబు, జ్వరం వస్తాయనే భయంతో చాలామంది వెనుకడుగు వేస్తారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పరిమిత సమయం పాటు వర్షంలో తడవడం కొంతమందికి మానసిక ఉల్లాసాన్ని కలిగించవచ్చు. అయితే కొన్ని ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వర్షపు చినుకులు, చల్లని వాతావరణం మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. ప్రకృతితో సన్నిహితంగా గడపడం వల్ల ఒత్తిడి తగ్గినట్లు అనిపించవచ్చు. వర్షంలో కొద్దిసేపు గడపడం మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో సహాయపడుతుంది. వర్షపు నీరు తాకడం వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది. వేడి వాతావరణం నుంచి ఉపశమనం లభించి తాజాగా ఉన్న భావన కలుగుతుంది. ఎండాకాలంలో చెమట కారణంగా వచ్చే కొన్ని చర్మ అసౌకర్యాల నుంచి చల్లని వర్షపు నీరు తాత్కాలిక ఉపశమనం ఇవ్వవచ్చు.

పాలకూర ఆకుల వెనుక డేంజర్ సీక్రెట్...



ప్రకృతి మనకు ప్రసాదించిన అత్యంత పోషకవిలువలున్న ఆకుకూరలలో పాలకూర అగ్రస్థానంలో ఉంటుంది. పరిమాణంలో చిన్నదైనప్పటికీ, ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అపారమైనవి. అందుకే వైద్యులు సైతం రోజువారీ ఆహారంలో పాలకూరను చేర్చుకోవాలని సూచిస్తుంటారు. మన శరీరానికి అవసరమైన ఐరన్, పీచుపదార్థం, విటమిన్ ఎ, సి వంటి కీలక పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనివల్ల ప్రజలు నిత్యం పప్పు, కర్రీస్, పరాటాలు, సూప్‌లు, సలాడ్‌లు, జ్యూస్‌ల రూపంలో పాలకూరను విరివిగా ఉపయోగిస్తుంటారు. పోషకాల గని అయిన పాలకూరను వంటల్లో ఉపయోగించే ముందు సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే మాత్రం ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పాలకూర ఆకులపై మట్టి, దుమ్ముతో పాటు కంటికి కనిపించని చిన్న చిన్న పురుగులు, బ్యాక్టీరియా చేరే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా కడగని ఆకుకూరలను తినడం వల్ల అనేక రకాల ఇన్ఫెక్షన్లు, కడుపు సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే వీటిని వండడానికి లేదా తినడానికి ముందు శుభ్రమైన పద్ధతుల్లో కడగడం చాలా ముఖ్యం. పాలకూరను క్లీన్ చేయడానికి ఒక సులభమైన మార్గం ఉంది. ముందుగా ఒక పెద్ద గిన్నెలో చల్లటి నీటిని నింపుకుని, అందులో పాలకూర ఆకులను వేసి మెల్లగా కదిలించాలి. ఇలా చేయడం వల్ల ఆకులపై పేరుకుపోయిన మట్టి లూజ్ అయి కిందకు రాలిపోతుంది. ఆ తర్వాత ప్రతి ఆకును విడివిడిగా పారుతున్న నీటి కింద ఉంచి కడగాలి. దీనివల్ల ఆకులకు పట్టుకుని ఉన్న మిగిలిన దుమ్ము, సూక్ష్మక్రిములు పూర్తిగా తొలగిపోతాయి. కేవలం కడగడమే కాకుండా కడిగిన తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలు కూడా అంతే ముఖ్యం. నీటి నుండి తీసిన పాలకూర ఆకులను ఒక శుభ్రమైన గుడ్డతో లేదా పేపర్ టవల్‌తో మెల్లగా తడి ఆరేలా తుడవాలి. గట్టిగా ఒత్తిడి పెడితే ఆకులు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కొన్ని ఆకులు వంగి లేదా ముడుచుకుని ఉంటాయి. అటువంటి ఆకుల మడతలలో మురికి, చిన్న కీటకాలు చిక్కుకుపోయే అవకాశం ఎక్కువ కాబట్టి కడిగేటప్పుడు ప్రతి మూలనూ నిశితంగా పరిశీలించి శుభ్రం చేయాలి. పాలకూరను నిల్వ చేసేవిషయంలో చాలామంది చేసే పొరపాటు.. మార్కెట్ నుండి తెచ్చిన వెంటనే కడిగి ఫ్రిజ్‌లో పెట్టడం. కానీ అలా చేయడం వల్ల అధిక తేమ కారణంగా ఆకులు త్వరగా కుళ్లిపోయి పాడవుతాయి. కాబట్టి పాలకూరను వండే ముందు మాత్రమే కడగడం ఉత్తమం.

ఆముదంతో అద్భుత లాభాలు.....



మన పూర్వీకులు వంటింట్లోనూ, సౌందర్య సాధనంగానూ ఆముదానికిఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. కాలక్రమేణా మార్కెట్లోకి వచ్చిన రసాయన ఉత్పత్తుల వల్ల దీని వాడకం తగ్గినప్పటికీ, ప్రస్తుత కాలంలో మళ్లీ ఆముదం ప్రాముఖ్యత పెరుగుతోంది. ఆముదంలో ఉండే రిసినోలిక్ యాసిడ్, విటమిన్ ఇ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు శారీరక ఆరోగ్యానికే కాకుండా, చర్మ, జుట్టు సంరక్షణకు అద్భుతంగా పనిచేస్తాయి. ఒత్తైన, పొడవైన జుట్టు కోసం: జుట్టు రాలడం, చుండ్రు మరియు జుట్టు పలచబడటం వంటి సమస్యలకు ఆముదం అద్భుతమైన పరిష్కారం. ఇది తలలో రక్తప్రసరణను మెరుగుపరిచి వెంట్రుకల కుదుళ్లను బలంగా మారుస్తుంది. కొబ్బరి నూనె లేదా బాదం నూనెతో కొద్దిగా ఆముదాన్ని కలిపి వారానికి రెండుసార్లు తలకు పట్టిస్తే జుట్టు ఒత్తుగా, నల్లగా పెరుగుతుంది.సహజసిద్ధమైన మాయిశ్చరైజర్: పొడి చర్మం ఉన్నవారికి ఆముదం ఒక వరం లాంటిది. ఇది చర్మంలోని తేమను బయటకు పోకుండా లాక్ చేస్తుంది. రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల ఆముదాన్ని ముఖానికి, చేతులకు రాసుకుంటే చర్మం కోమలంగా, కాంతివంతంగా మారుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం: ఆముదానికి సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలు ఉన్నాయి.

వర్షాకాలంలో పుదీనా తింటే ఇన్ని కష్టాలా...?



వేసవి కాలంలో పుదీనా చట్నీ, జల్జీరా, రైతా, లేదా పుదీనా షర్బత్ లేని ఇల్లు ఉండదు. ప్రజలు దాని చల్లదనాన్ని, సువాసనను రెండింటినీ ఇష్టపడతారు. కానీ, వర్షాకాలం ప్రారంభం కాగానే, చాలా ఇళ్లలో ఒకే మాట పదేపదే వినిపిస్తుంది. ఇప్పుడు పుదీనా తక్కువగా తినాలని... చాలా మంది ఇది కేవలం అపోహ అని అనుకుంటారు. కానీ, ఆయుర్వేదంలో దీనికి దాని స్వంత కారణాలు ఉన్నాయి. శరీరం అన్ని కాలాల్లోనూ ఒకే విధంగా ప్రవర్తించదు.వేసవిలో పనిచేసేది వర్షాకాలంలో అదే విధంగా పనిచేయకపోవచ్చు. అందుకే కాలాలు మారేకొద్దీ మీ ఆహారాన్ని మార్చుకోవాలని ఆయుర్వేదం సిఫార్సు చేస్తుంది. ఈ నేపథ్యంలోనే కానీ వర్షాకాలంలో పుదీనాను తీసుకోకపోవడమే మంచిదని ఆయుర్వేద నియమాలు చెబుతున్నాయి. పుదీనా అనగానే మనకు దాని అద్భుతమైన సువాసన, చలువ చేసే గుణం గుర్తుకొస్తాయి. ఎండకాలంలో బాడీని కూల్ చేయడానికి పుదీనా చట్నీ, పుదీనా జ్యూస్ లేదా మోహిటోలను ఎక్కువగా తీసుకుంటాం. అయితే, వేసవిలో అమృతంలా పనిచేసే ఈ పుదీనా, వర్షాకాలం వచ్చేసరికి ఆరోగ్యానికి హాని కలిగించే అవకాశం ఉందని ఆయుర్వేద శాస్త్రం, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో పుదీనా తినడం వల్ల కలిగే నష్టాలు, పాటించాల్సిన ఆయుర్వేద నియమాలు ఏంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. బ్యాక్టీరియా, కీటకాల ముప్పు: వర్షాకాలంలో వాతావరణంలో తేమ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com